నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 17 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బోరు ముందు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బోరు నీళ్లందించండి సారూ..

భీమారంలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

భీమారం, జనవరి 16 : 'బోరు నీళ్లు రాక వారమైతంది. మస్తు తిప్పల పడుతున్నం. ఇకనైనా మా బాధను పట్టించుకోండి సారూ..' అంటూ భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోగల వడ్లకొండ మహిళలు కోరారు. ఈ మేరకు గురువారం బోరు వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. బోరు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని, మిషన్ భగీరథ నీళ్లే దిక్కవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించడం లేదని, నాయకులను అడిగితే కనీసం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇకనైనా తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో వడ్ల కొండ రాజేశ్వరి, సుగుణ, సకనారపు లచ్చు, గోడిసెల మల్లు, సుందిల్ల స్వప్న, వడ్ల దుర్గు, శనిగారపు సబిత, సకినారపు మధునక్క పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ ఫలాలు

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి, జనవరి16 : జిల్లాలోని ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ పథకాలు అందించేందుకు యంత్రాంగం సమన్వయంతో పని చేస్తున్నదని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దండేపల్లి మండలం మేదరిపేట, ముత్యంపేట, చింతపెల్లి గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న రేషన్‌కార్డు, వ్యవసాయ సర్వేను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, రేషన్ కార్డులు ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఎలాంటి పొరపాట్లు , అవకతవకలు లేకుండా జాబితా రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, ఏవో అంజిత్‌కుమార్, జీపీ కార్యదర్శులు హరీశ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటన.

దండేపల్లి, (లక్షెట్టిపేట), జనవరి16 : ఎల్లారం, గుల్లకోటలో కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించారు. రేషన్‌కార్డు సర్వేతో పాటు రైతు భరోసా పథకంలో భాగంగా వ్యవసాయ భూములను క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో సరోజ, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

మంచిర్యాలలో దాడుల దడ..!

ఏడాదిగా కొనసాగుతున్న విష సంస్కృతి

● పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా మారని తీరు ● ప్రశ్నించినా, అడ్డు తిరిగినా దెబ్బలు తప్పవన్న భయం!

● జనాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్న వ్యవహారం

"గతేడాది డిసెంబర్ 18న ఆర్‌అండ్‌ఆర్ తాళ్లపల్లి ప్లాట్స్ సమీపంలో ఓ సామాజిక కార్యకర్తపై కొందరు రాళ్లతో దాడి చేశారు. ఆయన తప్పించుకొనే ప్రయత్నం చేయడం, అదే సమయానికి ఆయన స్నేహితుడు అక్కడికి రావడంతో దాడి చేసిన వ్యక్తులు పారిపోయారు. స్వల్పగాయాలతో సదరు వ్యక్తి బయటపడ్డాడు."

"జనవరి 15న మంచిర్యాలలోని మటన్ అండ్ ఫిష్ మార్కెట్‌లో మంచిర్యాలకు చెందిన ఓ రాజకీయ పార్టీ నాయకుడిపై కొందరు దాడి చేశారు. ముక్కు, చెవుల నుంచి రక్తం వచ్చేలా కొట్టారు. గతంలో ఏదో రోడ్డు పనులపై ఫిర్యాదు చేశానని, దానిని దృష్టిలో పెట్టుకొనే దాడి చేశారంటూ బాధితుడు స్వయంగా చెప్పాడు."

- మంచిర్యాల, జనవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) :

...ఇలా ఈ రెండు కేసులనే కాదు. మంచిర్యాలలో గతేడాది కాలంగా ఇలాంటి దాడులు జరగడం పరిపాటిగా మారింది. ఎవరు ప్రశ్నించినా, ఎవరు అడ్డు వచ్చినా కచ్చితంగా దెబ్బలు తినాల్సి వస్తుందనే భయం జనాల్లో నాటుకుపోతున్నది. గతంలో ఇదే తరహాలో దాడులు జరిగిన నేపథ్యంలో మీడియా వాటిపై ప్రధానంగా దృష్టి సారించింది. ప్రభుత్వం, పోలీసులు సీరియస్‌గా తీసుకోవడంతో కొన్ని రోజుల పాటు ఎలాంటి అలజడి కనిపించలేదు. కానీ, మంచిర్యాలలో మరోసారి దాడుల సంస్కృతి మొదలైందా అంటే.. అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. గతేడాది సైతం ఇలాంటి దాడులు, ప్రతిదాడులు జరిగాయి. వినాయక నిమజ్జనంలో కత్తుల కొట్లాట, మాధవి బార్ ముందు హాకీ స్టిక్స్ గొడవ, బీఆర్ఎస్ లీడర్ రాకేశ్‌పై దాడి.. బైపాస్‌రోడ్డులో గ్యాంగ్‌ల గొడవలు.. సద్దుల బతుకమ్మ రోజున గల్లీ గొడవలు.. ఇలా చెప్పుకుంటూ పోతే మంచిర్యాల దాడులపై ఓ పుస్తకమే రాయాల్సి వస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఇప్పుడేమైంది..

ఇలాంటి వరుస ఘటనల నేపథ్యంలో గతేడాది దాడుల వ్యవహారం పెద్ద దుమారమే రేపింది. మీడియా దృష్టి సారించడం.. అన్ని పత్రికలు, టీవీ ఛానళ్లలో కథనాలు వచ్చిన నేపథ్యంలో పోలీసులు దీన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఇలాంటి ఘటనతో సంబంధం ఉన్న వారందరినీ పిలిపించి మాట్లాడారు. ఇలాంటివి పునరావృతమైతే ఊరుకునేది లేదంటూ తీవ్రంగా హెచ్చరించారు. పోలీసులు సీరియస్‌గా ఉన్నారనో.. ఇతర రాజకీయ కారణాలో తెలియదు కానీ.. కొన్నాళ్ల పాటు దాడులకు దూరంగా ఉంటూ వచ్చిన గ్యాంగ్‌లు మళ్లీ రెచ్చిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు ఎప్పుడు జరిగినా వెంటనే సీరియస్ యాక్షన్ తీసుకోవాలి. కానీ కొన్నిసార్లు పోలీసులే అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది డిసెంబర్ 18న జరిగిన దాడి ఘటనలో తాను చెప్పిన ప్రకారం కాకుండా వేరే మాదిరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సామాజిక కార్యకర్త ఆరోపిస్తున్నారు. తనపై దాడికి రెండు రోజులు ముందు నుంచే ప్లాన్ చేశారని, ఫోన్ చేసి బయటికి వచ్చేలా చేశారని.. ఇందుకు ప్రధాన కారకులైన ఇద్దరి వ్యక్తుల పేరను ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నానని.. కానీ వారి పేర్లు ఎఫ్ఐఆర్‌లోనే లేకుండా చేశారిన బాధితుడు చెబుతున్నాడు. పోనీ వాళ్లని పట్టుకొని అడగాల్సిన పోలీసులు.. పిలిస్తే సదరు వ్యక్తులు స్టేషన్‌కు రావడం లేదని చెబుతున్నారని వాపోతున్నాడు. దాడి ప్రదేశంలో ఉన్న సీసీ కెమెరాలు పని చేయడం లేదని అంటున్నారని, తనను కొట్టి లాక్కెళ్లిన ఫోన్‌లో దాడికి కారకులైన వ్యక్తులు మాట్లాడిన ఆధారాలున్నాయని చెబుతున్నా.. ఆ ఫోన్‌ను ఇప్పటి వరకూ రికవరీ చేయలేదంటున్నాడు. తనపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం, దొంగతనంలాంటి సెక్షన్ల కింద కేసు పెట్టకుండా బెయిలేబుల్ సెక్షన్ల కింద కేసు పెట్టారని సదరు వ్యక్తి ఆరోపిస్తున్నాడు. ఈ విషయంపై సీపీ, డీసీపీలకు ఫిర్యాదు చేస్తే ఏ స్టేషన్‌లో నామమాత్రపు కేసు నమోదు చేశారో అదే స్టేషన్‌కు బదలాయించి చేతులు దులిపేసుకున్నారంటున్నాడు. గతంలో ఇలాంటి దాడుల వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఈ కేసులో ఇంకా దాడి చేసిన వ్యక్తులను గుర్తించకపోవడం కొనమెరుపు. బాధితుడి కథనం ప్రకారం కేసు ఎందుకు నమోదు చేసి, కారకులైన వారిని ఇంకా ఎందుకు గుర్తించలేదు.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే కేసును పోలీసులు కొంత సీరియస్‌గా తీసుకొని బాధితుడికి న్యాయం జరిగేలా చేసి ఉంటే మంచిర్యాలలో మరో దాడి జరిగేది కాదనే చర్చ ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

రాజకీయ కక్షలు.. వ్యక్తిగతంగా మారాయా..

మంచిర్యాలలో జరుగుతున్న వరుస దాడులు వెనుక రాజకీయ కక్షలు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. బాధితులు చెబుతున్న కథనాలు అలాగే ఉంటున్నాయి. మొన్నటికి మొన్న జనవరి 15న ఓ రాజకీయ నాయకుడిపై దాడి చేసింది ఎవరో ఆయనే స్వయంగా వెల్లడించారు. రెండున్నరేళ్ల క్రితం ఏదో రోడ్డు పనులు సరిగా చేయడం లేదని తాను ఇచ్చిన ఫిర్యాదుతో ఆ పనులు ఆగిపోయాయని.. దానితో సదరు వ్యక్తి అనుచరులతో తనపై దాడి చేశారంటూ ఆయన చెప్పుకొచ్చారు. డిసెంబర్ 18న దాడి ఘటనలతో బాధితుడు సైతం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, పలు అంశాలపై ఆర్టీఐలు వేయడం మూలంగానే తనపై దాడి చేశారని చెబుతున్నారు. ఇలా దాడుల వెనుక ఉన్న రాజకీయ కారణాలు ఉండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికైనా ఈ దాడుల వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు సీరియస్‌గా తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగోన్నతి పొందిన అధికారులతో సీపీ శ్రీనివాస్

ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత

● రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, జనవరి 16 : ఉద్యోగోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఎస్ఐగా పనిచేస్తూ ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన 13 మందిని అభినందించారు. సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డమ్మీ తుపాకీతో బెదిరించిన వ్యక్తిపై కేసు

మంచిర్యాల అర్బన్, జనవరి 16 : బార్‌కు వచ్చి పుల్లుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి బిల్లు కట్టకుండా డమ్మీ తుపాకీతో బెదిరించి పారిపోయిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇందూ బార్‌లోకి బుధవారం రాత్రి ఓ వ్యక్తి వచ్చి టేబుల్ దగ్గర కూర్చొని మందు ఆర్డర్ చేసుకున్నాడు. పుల్లుగా తాగిన తర్వాత బిల్లు చెల్లించకుండా ఇంకా మందు కావాలంటూ డమ్మీ తుపాకీతో బెదిరించాడు. అది డమ్మీ తుపాకీ అని అనుమానం వచ్చిన సర్వర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామనగానే అక్కడి నుంచి పారిపోయాడు. ఆ తర్వాత పోలీసులు విచారణ చేపట్టగా బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లికి చెందిన పొనగంటి రాజుగా గుర్తించారు. బార్ ఓనర్ ఏవూరి జగన్మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

సింగరేణి అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

● మందమర్రి ఏరియా జీఎం దేవేందర్

మందమర్రి, జనవరి 16 : సింగరేణిలో కొత్తగా ఉద్యోగంలో చేరిన వారంతా సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జీ.దేవేందర్ కోరారు. గురువారం స్థానిక ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 8 మంది మెడికల్ ఇన్‌వాలిడేషన్ డిపెండెంట్లకు జీఎం దేవేందర్ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర పరిశ్రమలతో పోలిస్తే సింగరేణిలో పని స్థలాలు, సమయాలు భిన్నంగా ఉంటాయన్నారు. విధులకు గైర్హాజరు అయితే ఉద్యోగ భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. మందమర్రి ఏరియాలో ఇప్పటి వరకు కారుణ్య నియామకాల ద్వారా 1806 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఎంవోఏఐ అధ్యక్షుడు రవి, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డివైపీఎం సత్యబోస్, ఓఎస్ రాజలింగు, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ పాల్గొన్నారు.

మందమర్రిలో నియామక పత్రాలు అందుకున్న వారితో అధికారులు

గిరి గ్రామాల్లో 60 శాతం రక్తహీనత

● ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా

● పెద్దాపూర్‌లో వైద్య శిబిరం ప్రారంభం

● కాలినడకన పావుగూడకు చేరుకున్న అధికారి

కాసిపేట, జనవరి 16 : గిరిజన గ్రామాల్లో 60 శాతం మంది రక్తహీనతతో బాధ పడుతున్నారని, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా పేర్కొన్నారు. గురువారం ఆదివాసీ గిరిజన గ్రామం పెద్దాపూర్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పలు సమస్యలపై ఆమెకు వినతిపత్రాలు అందించారు. పావుగూడ ఆదివాసీ గిరిజన గ్రామాన్ని సందర్శించాలని గ్రామస్తులు కోరడంతో పీవో కాలి నడకన పత్తి చేలను దాటుకుంటూ అక్కడికి చేరుకున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని, తప్పకుండా ఊట్నూర్‌కు రావాలని సూచించారు. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి తప్పకుండా చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. వైద్య శిబిరంలో మొత్తం 146 మందికి పరీక్షలు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభించాల్సిన వైద్య శిబిరాన్ని మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, ఆర్ఎంవో భీష్మా, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు సుధాకర్ నాయక్, అనిత, ఎన్‌సీడీ పీవో ప్రసాద్, వైద్యాధికారి రవి కిరణ్, వైద్యులు శివ ప్రతాప్, శ్రీ దివ్య, మంచిర్యాల దవాఖాన వైద్యులు, కాసిపేట పీహెచ్‌సీ సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఆదివాసీ నాయకులు కొమ్ముల బాపు, ఆత్రం మహేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా

యువత క్రీడల్లో రాణించాలి

● జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూర్ రూరల్, జనవరి 16 : యువత క్రీడల్లో రాణించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆస్నాద్ గ్రామంలో యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌ను చెన్నూర్ సీఐ రవీందర్‌తో కలిసి ప్రారంభించారు. యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి పోలీసుల సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్‌లో 32 టీమ్‌లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బెల్లంకొండ కరుణ సాగర్‌రావు, మాజీ ఉప సర్పంచ్ నస్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 16 : ప్రభుత్వ పథకాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం అంకుసాపూర్ గ్రామంలో చేపడుతున్న రైతు భరోసా, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో అనర్హులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయవద్దన్నారు. అనంతరం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సందీప్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, పాల్గొన్నారు.

గోలేటి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు, నాయకులు

రెబ్బెన, జనవరి 16 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు కార్మికులు గురువారం సాయంత్రం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జీఎం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక రాష్ట్ర అధ్యక్షుడు అక్బర్ అలీ, బెల్లంపల్లి ఏరియా కాంట్రాక్టు కార్మిక ఇన్‌చార్జి బయ్య మొగిలి తదితరులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఆందోళనలు చేపడుతామన్నారు. హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ వైద్య సదుపాయం, అండర్ గ్రౌండ్ అలవెన్స్, మైన్ యాక్ట్ ప్రకారం ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి సిక్ లీవులు, పండుగ సెలవులు ఇవ్వాలని, నాగాల పేరిట కాంట్రాక్టు కార్మికుల నుంచి రికవరీ చేస్తున్న ఫైన్ విధానం రద్దు చేయాలని, ఓసీపీల్లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లను వోల్వో ఆపరేటర్లుగా గుర్తించి హైపవర్ వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులందరికీ సీఎంఫీఎఫ్ నంబర్లు, లోన్ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లు కేటాయించాలని, నర్సరీలో పని చేస్తున్న కార్మికులను సింగరేణి కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జగ్గయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మిక వర్కింగ్ ప్రెసిడెంట్ రాయిళ్ల నర్సయ్య, కాంట్రాక్టు కార్మిక గోలేటి బ్రాంచ్ కార్యదర్శి చల్లూరి అశోక్, సహాయ కార్యదర్శి సాగర్‌గౌడ్ ఉన్నారు.

పోతురాజు జాతరకు పోటెత్తిన భక్తులు

● ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఏఎస్పీ చిత్తరంజన్, ఏపీవో మనోహర్ ప్రత్యేక పూజలు

● కబడ్డీ పోటీలు ప్రారంభం

కెరమెరి, జనవరి 16 : ఉత్తూర్‌పేటలో కొలువైన ధర్మరాజు, పోతురాజు జాతర గురువారం ప్రారంభం కాగా భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఏఎస్పీ చిత్తరంజన్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వాంకిడి సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ గుంపుల విజయ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సీనియర్ అసిస్టెంట్ శ్యామల, మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, కటోడ లచ్చు, దేవ్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్ సిడాంరాజు, కార్యదర్శి సిడాం ధర్ము, నాయకులు పెందోర్ రాజేశ్వర్, మడవి రఘునాథ్ పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి, నాయకులు